# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 06-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- అనధికార వలసదారుల తరలింపు విషయంలో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు.
- ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో "జన్ జాతి సాంస్కృతిక సమాగం 2025" ఈరోజు ప్రారంభమైంది.
- విద్యార్థులలో ఒత్తిడి తొలగించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన కార్యక్రమం 'పరీక్షా పే చర్చ' 8వ సంచిక ఈనె 10వ తేదీన న్యూఢిల్లీలో జరగనుంది.

==========================

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధానమంత్రి ఈ రోజు రాజ్యసభలో మాట్లాడుతూ.. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా ఉందని కొనియాడారు. అది అందరికీ ముందుకు సాగే మార్గాన్ని చూపించిందని పేర్కొన్నారు. "సబ్ కా సాథ్... సబ్ కా వికాస్..." నినాదంతో ముందుకెళ్తున్నామని, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక, పారిశ్రామికీకరణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొత్త కాదని, ఇది అంతర్జాతీయ సంబంధాలలో సాధారణంగా ఆమోదించబడిన సూత్రమని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అక్రమ వలసదారులను స్వదేశానికి పంపుతోన్న

తరుణంలో.. వారి పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరుపై రాజ్యసభలో ఈరోజు ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్రమంత్రి మంత్రి స్పందిస్తూ... విదేశాలల్లో చట్ట విరుద్ధంగా నివశిస్తున్నట్లు తేలితే తమ పౌరులను తిరిగి తీసుకురావడం అన్ని దేశాల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. అయితే దేశం నుంచి వెనక్కి పంపుతోన్న తరుణంలో వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మాత్రం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని జయశంకర్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

పరీక్షల సమయంలో విద్యార్థులలో ఒత్తిడి తొలగించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన కార్యక్రమం 'పరీక్షా పే చర్చ' 8వ సంచిక ఈనె 10వ తేదీన న్యూఢిల్లీలోని భారత మండపంలో జరగనుంది. త్వరలో పరీక్షలు రానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని సరికొత్తగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల్లోని భయాన్ని తొలగించి.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం ప్రధానమంత్రి ఈ కార్యక్రమం ద్వారా చేస్తున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మిళితం చేస్తూ.. 'పరీక్షా పే చర్చ' నిర్వహిస్తున్నారు. ఇన్నాళ్లూ ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఒక్కరే పాల్గొంటూ వచ్చారు. కానీ ఈసారి కొత్తగా నటీనటులు దీపికా పదుకొణె, విక్రాంత్ మేస్సేతో పాటు ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ తదితరులను 'పరీక్షా పే చర్చ'కు ఆహ్వానించారు. పరీక్షా పే చర్చ కోసం ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 9.72 లక్షల మంది విద్యార్థులు, 1.01 లక్షల మంది టీచర్లు, 24 వేల 289 మంది తల్లిదండ్రులు రిజిస్టర్ అయినట్లు అధికారులు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

విరామం

========================

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని కుంభ మేళాలో జన్ జాతి సాంస్కృతిక సమాగం 2025 ఈరోజు ప్రారంభమైంది. మొత్తం 6 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 15 వేల మంది గిరిజనులు పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేలా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గిరిజన నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు భగవాన్ బిర్సా ముండా 150వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం 2025వ సంవత్సరాన్ని "జన్ జాతీయ గౌరవ్ వర్ష్"గా ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

========================

మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలోని బెహ్రో గ్రామం సమీపంలో ఈరోజు వైమానిక దళానికి చెందిన మిరాజ్ 2000 యుద్ధ విమానం కూలిపోయింది. సాధారణ శిక్షణలో భాగంగా బయలుదేరినప్పుడు ఈ ప్రమాదం సంబవించింది. ఈ సమయంలో అందులో ఉన్న ఇద్దరు పైలట్ లు సురక్షింతంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఆర్మీ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టాయి. అయితే యుద్ధ విమానం కూలిపోవడానికి గల కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై భారత వైమానిక దళం దర్యాప్తునకు ఆదేశించింది.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో చేసే వార్షిక సంభాషణ కార్యక్రమం పరీక్షా పే చర్చ ఈ నెల 10న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న నేపథ్యంలో విభిన్న రంగాలకు చెందిన ప్రఖ్యాత వ్యక్తులు విద్యార్థులతో సంభాషించి, వారి అనుభవాలు, జ్ఞానాన్ని పంచుకుంటారని విద్యా మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమంలో, ప్రధానమంత్రితో

నేరుగా సంభాషించడానికి ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నుండి వివిధ పాఠశాలల నుండి 36 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆ శాఖ తెలియజేసింది.

==========================

ర్యాగింగ్ నిరోధక చర్యలు పాటించని వైద్య కళాశాలలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా ఉన్న 18 వైద్య కళాశాలలకు ఈ నోటీసులను పంపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, బిహార్ నుంచి మూడు చొప్పున కాలేజీలు ఉండగా.. ఢిల్లీ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి నుంచి రెండేసి, మధ్యప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ నుంచి ఒక్కో కాలేజీ చొప్పున ఉన్నాయి. కాలేజీల్లో ర్యాంగింగ్ ను కట్టడి చేసేందుకు యాంటీ ర్యాగింగ్ రెగ్యులేషన్స్- 2009 నిర్దేశించిన తప్పనిసరి అంశాలను ఈ కళాశాలలు పాటించలేదని యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి తెలిపారు. ఈ నోటీసు అందిన తేదీ నుంచి 7 రోజుల్లోగా సరైన కారణాలను, లోపాల్ని సరిదిద్దేందుకు తీసుకొనే చర్యల్ని వివరిస్తూ... లిఖితపూర్వక వివరణ పంపాలని ఆదేశించినట్లు తెలియజేశారు.

==========================

నైజీరియాలోని వాయువ్య ప్రాంతంలోని ఒక పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది పిల్లలు మరణించారు. మరో 17 మంది పిల్లలు తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని అధికారులు వెల్లడించారు. జంఫారా రాష్ట్రంలోని కౌరా నమోడా జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో సుమారు 100 మంది పిల్లలు పాఠశాలలో ఉన్నారని ఆ దేశ అత్యవసర ప్రతిస్పందన సంస్థ తెలియజేసింది. పాఠశాల పరిసరాల్లో నోటి పరిశుభ్రత కోసం ఉపయోగించే “కారా” అనే కర్రలను నిల్వ చేయడం వల్ల మంటలు సంభవించాయని ప్రాథమిక పరిశోధనలు సూచిస్తున్నాయని ఏజెన్సీ తెలియజేసింది.

==========================

భారత్, ఇంగ్లాండ్ క్రికెట్ పురుషుల జట్ల మధ్య 3 వన్డేల సిరీస్‌లో భాగంగా ఈరోజు తొలి మ్యాచ్ నాగ్‌పూర్‌లో జరుగుతోంది. టాస్ గెలిచి తొలిత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన భారత్ కడపటి వర్తలు అందే సమయానికి 38 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78 వేల 271 వేల పాయింట్ల లాభాల్లో ప్రారంభమై.... చివరికి 213 పాయింట్ల నష్టంతో 78 వేల 058 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.55 పాయింట్ల నష్టంతో 23 వేల 622 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.60గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.94 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 880 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

==========================
==========================